క్లుప్తంగా

ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దీపిక, ఉపాధ్యాయులు

నర్సాపూర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తన వంతు సాయం చేయాలన్న ఉద్దేశంతో పరీక్ష సమయంలో అవసరమయ్యే వస్తువులు బుధవారం అందజేసినట్లు మండల వ్యవసాయాధికారి దీపిక తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతికి చెందిన 64 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్, స్కేల్, హాల్ టికెట్ కవర్, పౌచ్ అందచేశానని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆమె తల్లి లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, ఉపాధ్యాయులు వీరేశం, సామ్యానాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాల పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో 24మంది విద్యార్థులకు బుధవారం ఆర్‌బీఎస్‌కే వైద్యులు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం సాజిద్ అలీ తెలిపారు. గత నెలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 24 మందికి కంటిచూపు సమస్య ఉండగా.. నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి మరోసారి పరీక్షించినట్లు చెప్పారు. దీంతో కంటి అద్దాలు అవసరంగా గుర్తించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు కృష్ణకుమార్, పద్మావతి, సిబ్బంది శ్రీనివాస్, రవి, రాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ముందస్తు హోలీ



రంగులు పూసుకుంటున్న చిన్నారులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని శేరీల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. అంగన్‌వాడీ టీచర్ దేవలతతో పాటు చిన్నారులు పరస్పరం రంగులు పూసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని దేవలత పేర్కొన్నారు.

అవసరం మేరకే నీరు పెట్టాలి



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ రాంప్రసాద్

టేక్మాల్ (మెదక్): వరి సాగు చేస్తున్న రైతులు అవసరం మేరకు మాత్రమే నీరు పెట్టాలని మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని బొడమట్పల్లిలో వరి పంటను రైతులతో కలసి పరిశీలించారు. పొలాల్లో నీటిని ఎక్కువ పెట్టకుండా మడులను అరబెడుతూ నీరు పెట్టాలన్నారు. పైరు ఎదగాలంటే నారు మడుల్లో పెరిగే గడ్డిని కలుపు రూపంలో తీయాలన్నారు. మోతాదుకు మించి మందులు వాడరాదని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ మన్నన్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మణ్, నాయకులు శ్రీమన్, స్వామి, లక్ష్మణ్, లింగం, సత్యనారాయణ, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మందులు లేవు.. వేతనాలు రావు!

- సమస్యల్లో సంచార పశు వైద్యశాలలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది



పశువుకు వైద్యం చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నర్సాపూర్: సంచార పశు వైద్యం అస్తవ్యస్తంగా మారింది. పశువులు, జీవాలు, ఇతర పెంపుడు జంతువులకు సత్వర వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సంచార పశు వైద్యశాల ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణను జీవీకే సంస్థకు అప్పగించింది. సంస్థ నియోజకవర్గానికి ఒక అంబులెన్స్ ఏర్పాటు చేసి అందులో వైద్యుడు, అసిస్టెంట్ ఉద్యోగి, డ్రైవర్, హెల్పర్‌ను నియమించింది. కాగా చాలా నెలలుగా సక్రమంగా వేతనాలు అందడం లేదని సిబ్బందికి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు, మూడు నెలలకు ఒకసారి వేతనాలు వచ్చాయని.. ప్రస్తుతం మూడు నెలలు అవుతున్నా అందలేదని వాపోయారు. దీంతో తమ కుటుంబాల పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మందులు సైతం సరిపడా లేవు

పశువులకు, పెంపుడు జంతువులకు అత్యవసరంగా రైతుల ఇంటి వద్దే వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంచార పశు వైద్యశాల ద్వారా మందులు సరిపడా అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే సిబ్బంది సదరు రైతు ఇంటికి వెళ్లి వారి పశువులకు సత్వర వైద్య సేవలందిస్తారు. అవసరమైన వైద్యంతో పాటు పలు రకాల మందులు అందజేస్తారు. ప్రధానంగా పెయిన్ కిల్లర్స్, జ్వరం, యాంటీ బయోటిక్, పలు రకాల లిక్విడ్‌లు గతంలో సరిపడా సరఫరా చేశారు. కాగా ఇటీవల వాటిని తక్కువ మోతాదులో సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. కాగా కొన్ని నెలలుగా మందులు సరిపడా రాకపోవడంతో ఉన్నంతలో మందులు అందజేస్తున్నారు. అవసరమైన ఇతర మందులను బయట కొనుగోలు చేసుకోవాలని సిబ్బంది రైతులకు సూచిస్తున్నారు. పశువులకు అత్యవసర వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సంచార వైద్యశాల వాహనానికి సరిపడా మందులు సరఫరా చేయకపోవడంతో సేవలు మొక్కుబడిగా అందుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



ఇబ్బంది పడుతున్నాం

తమకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. దీంతో ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నాం. జీతాలు వెంటనే విడుదల చేయాలి. అలాగే తమ సంచార వైద్యశాలకు సరిపడా మందులు రావడం లేదు. అవసరం మేరకు మందులు ఇవ్వకపోవడంతో రైతుల నుంచి మాటలు పడాల్సి వస్తుంది.

- డాక్టర్ వినీత్‌రెడ్డి, సంచార పశువైద్యశాల, నర్సాపూర్

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): చికిత్స నిమిత్తం మంజూరైన ఎల్‌ఓసీని బుధవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అందజేశారు. మండల పరిధి పిల్లుట్ల గ్రామానికి చెందిన దాసరి భూమయ్య అనారోగ్యానికి గురికావడంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం మంజూరైన రెండు లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్వామి, బాలేష్, శివకుమార్, పోచగౌడ్, గణేష్, సురేష్, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

అవినీతి ఆరోపణలు తగదు

పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి



మాట్లాడుతున్న యశ్వంత్ రెడ్డి

టేక్మాల్(మెదక్): రాజకీయ కక్షతో తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి అన్నారు. బుధవారం టేక్మాల్ పాక్స్ గోదాంలో మహాజన సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదాం పునర్నిర్మాణం, నూతన బ్యాంకు నిర్మాణం, వడ్ల కొనుగోలు చేయడం వంటి పనులతో అభివృద్ధి చేశానే తప్ప ఎక్కడ కూడా అవినీతి చేయలేదన్నారు. రాజకీయ దురుద్దేశంతో అధికార పార్టీ నాయకులు తనను బద్నాం చేస్తున్నట్లు మండిపడ్డారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించేందుకు ముందు ఉంటానన్నారు. ఇందులో వైస్ చైర్మన్ వెంకయ్య, డైరెక్టర్లు, మాజీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అల్ట్రాఫాస్ట్ సిమెంటుపై అవగాహన



బీమా పత్రాలు అందజేస్తున్న డీలర్లు

నర్సాపూర్: భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంటుపై బుధవారం స్థానిక శ్రీనివాస స్టీల్ అండ్ సిమెంటు ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో సంస్థ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ వి.శ్రీకాంత్ మాట్లాడుతూ భారతి సిమెంటు అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంటును విడుదల చేసిందన్నారు. ఇతర కంపెనీల సిమెంటుతో పోలిస్తే ఈ సిమెంటుతో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని చెప్పారు. స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలతో పాటు రహదారుల నిర్మాణానికి తమ సిమెంటు సరైన ఎంపికని, ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తామని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న తాపీ మేస్త్రీలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ప్రమాద బీమా పత్రాలను స్థానిక డీలర్లు పి.రమేష్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన అందజేశారు.

ఎల్లమ్మ, దుర్గమ్మ దేవీల విగ్రహ ప్రతిష్ఠ

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్నచింతకుంటలో ఘనంగా నిర్మించిన ఎల్లమ్మ, దుర్గమ్మ దేవి ఆలయాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు శంకర్, బాల్‌రాజు, సంఘసాని రాజు, గిరిలను శాలువాలతో సన్మానించారు.



చాకరిమెట్ల అడవిలో మంటలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చాకరిమెట్ల అటవీలో బుధవారం మంటలు అంటుకున్నాయి. గుర్తించిన స్థానికులు నర్సాపూర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పేశారు. అచ్చంపేట అటవీ ప్రాంతం నుంచి మంటలు చెలరేగి చాకరిమెట్ల అటవీప్రాంతం వైపు రావడంతో అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది రమేష్, అనీల్, నాగరాజులు ఆర్పేశారు.

సామాన్యులకు బిగ్ రిలీఫ్

- పడిపోయిన కూరగాయల ధరలు
- నష్టపోతున్న అన్నదాతలు



సంతలో విక్రయిస్తున్న కూరగాయలు



ఓ రైతు పొలంలో విరగకాసిన టమాటాలు

జహీరాబాద్ టౌన్: గత నెల వరకు కూరగాయలు ధరలు ఆమాంతం పెరిగి కొనలేని, తినలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం టమాటా నుంచి క్యారెట్ వరకు అన్ని కూరగాయల ధరలు కిలో రూ. 10 నుంచి రూ. 40కే వస్తున్నాయి. కూరగాయల పంటలు బాగా పండటం, కర్నాటక, మహారాష్ట్రాల నుంచి మార్కెట్‌కు పెద్ద మొత్తంలో రావడంతో డిమాండ్ లేక ధరలు తగ్గాయి. నిత్యావసరాలైన టమాటా, ఉల్లి, వెల్లులి, బంగాళదుంప, వంకాయ, చిక్కుడు, ధరలు తగ్గి నిలకడగా ఉన్నాయి, ఉల్లిపాయ ఒక్కటే కిలో రూ. 30 పలుకుతుంది. కిలో రూ. 200 ఉన్న వెల్లుల్లి వంద రూపాయలకు దిగివచ్చింది. బీన్స్, క్యాప్సికమ్, బీట్‌రూట్, ఇతర కూరగాయల ధరలు పూర్తిగా తగ్గాయి. తోటకూర, మెంతికూర, పాలకూర, పుదీన, కొత్తిమీర తదితర ఆకుకూరలు పది రుపాయలకే పెద్ద కట్ట ఇస్తున్నారు. కూరగాయల ధరలు నిలకడగా ఉండడంతో సామాన్యులకు మంచి ఉపశమనం పొందినట్లు అయింది. పంటలు పండిస్తున్న రైతులు మాత్రం నష్టపోతున్నారు. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పండించిన పంటకు ధరలేక ఆందోళన చెందుతున్నారు. టమాటాకు పూర్తిస్థాయిగా ధరలేకుండా పోయింది. దీంతో టమాటా కొనేవారు లేక రైతులు కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాక అన్నదాతను నష్టాల బారిన పడుతున్నారు.

వృద్ధురాలు అదృశ్యం



మెదక్ మున్సిపాలిటీ: మతిస్థిమితం లేని 68 ఏళ్ల వృద్ధురాలు నీరుడి కిష్టమ్మ తప్పిపోయిందని పట్టణ సీఐ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీన పట్టణంలో తప్పిపోయినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ 8712657878, 8712657913 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మెదక్ మున్సిపాలిటీ: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి యంగ్ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. మెదక్ పట్టణానికి చెందిన కుమ్మరి సంతోష్ నివాస గృహం ప్రమాదవశాత్తు కాలిపోయింది. విషయం తెలుసుకున్న యంగ్ స్టార్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రాగి వనజ, కార్యదర్శి సౌమ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ తరఫున కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వనపర్తి రాణి, మునగాల రాణీ, పద్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

చిన్నశంకరంపేట(మెదక్): నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం రూ. 200 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పేటలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌నాయక్, రాజ్‌కుమార్‌గౌడ్, ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్కూల్ నిర్మాణం కోసం తొలిదశలోనే నిధులు సాధించిన ఎమ్మెల్యేను అభినందించారు. స్కూల్ ఏర్పాటుతో నాణ్యతతో కూడిన విద్య లభించనుందని అన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

చిలప్‌చెడ్(చిలప్‌చెడ్): మండల పరిధిలోని గౌతాపూర్ ఎస్సీ కాలనీ, ఐదో వార్డులో తీవ్రమైన తాగునీటి సమస్యలు నెలకొన్నాయి. బుధవారం మహిళలు గ్రామ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో వ్యవసాయ బోరు బావులను ఆశ్రయిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా జరగడం లేదని, మూడు రోజులు గ్రామంలో జాతర జరగడంతో నీటి సరఫరా విషయంలో అవకతవకలు జరిగాయన్నారు. నీటి సమస్యలు ఉంటే ట్యాంకర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు సహజం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట(మెదక్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం విఠల్ అన్నారు. బుధవారం పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు జగదీశ్వర్, అనితలను ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కొంత కాలంగా ఇక్కడ విద్యార్థులకు వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుజ్జరి రవి, ఆశారాణి, ప్రవీణ్, కాన్షీరాంజాదవ్, అబ్దుల్ సమీ, శ్రీనివాస్, వెంకటేశం, స్వరూప, సమీయుల్లా తదితరులు ఉన్నారు.

మంజీరా విద్యాలయంలో గ్రాడ్యుయేషన్ డే



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామాయంపేట(మెదక్): మంజీరా విద్యాలయంలో కిండర్ గార్డెన్ విద్యార్థులకు బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులు ప్రీ ప్రైమరీ ముగించుకొని ప్రైమరీ స్థాయికి వెళ్తున్న క్రమంలో ఈ కార్యక్రమం నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలు ఫొటో తప్పనిసరి దిగాలి

ఏపీఓ పొలు



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

టేక్మాల్(మెదక్): ఉపాధి హామీ కూలీలు తప్పనిసరిగా రెండుసార్లు ఫొటో దిగాలని ఏపీవో పొలు తెలిపారు. బుధవారం టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు కొలతల ప్రకారం డబ్బులు వస్తాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాల ప్రకారం పనులను చేయాలన్నారు. పనులకు హాజరయ్యే ముందు, ముగింపు తర్వాత రెండుసార్లు గ్రూపుల వారీగా ఫొటో దిగాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీలు రైతులకు ఉపయోగపడే అనేక రకాల పనులు ఉన్నాయని తెలిపారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ బీరప్ప తదితరులు ఉన్నారు.

'ఉపాధి' పనులపై అవగాహన



శంకరంపేటలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఆయా గ్రామాలలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ బుధవారం పరిశీలించారు. మట్టి రోడ్లు, ఫాంపాండ్స్ తదితర పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ప్రతీ పంచాయతీలో 60 మంది కూలీలకు పనులు కల్పించాలని, కూలీలకు కొలతలపై అవగాహన కల్పించాలని, పని ప్రదేశంలో ఇబ్బందులు లేకుండా చూడాలని టీఏలకు, ఎఫ్ఏలకు ఆయన సూచించారు.

ఘనంగా స్వపరిపాలన



తూప్రాన్ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఐదో తరగతి విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు రామకృష్ణ, సుమతి, రజనీదాస్, సుమలత తదితరులు పర్యవేక్షించారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా డీఈఓగా శివసాయి, ఎంఈఓగా ఫయాజ్, ఏఎంఓ సోఫియా, ప్రధానోపాధ్యాయులుగా మేఘశ్యామ్, ఉపాధ్యాయులుగా భవ్యశ్రీ, మర్షిని, భవాని, మనస్విని, హర్షిత, సాయి చరణ్, అలీ, సాయిరాం, హేమంత్, మేఘన, మైథిలి, సాయి, సుష్మిత, శ్రీరామ్, జగన్ మోహన్, కృష్ణలు వ్యవహరించారు.

తునికిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. డీఓగా సరిత, ఎంఈఓగా గౌతం, కాంప్లెక్స్ హెచ్‌ఎంగా ప్రశాంత్, హెచ్‌ఎంగా రిత్విక్, ఉపాధ్యాయులుగా వేదశ్రీ, జువేరియా, దీప్తి, యోగేశ్వరి, జోయ, శృతి, నందిని, లోహిత్ విధులు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, శైలజ, బాల్‌సింగ్, నీలమ్మ, సమ్రీన్ పరిశీలించి విద్యార్థులకు బహుమతులు అందచేశారు.



రాజ్‌పేట ప్రాథమిక పాఠశాలలో ..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొడుపాక ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం జరిగింది. డీఈఓగా గౌతమి, ఎంఇఓగా సిద్దు.హెచ్‌ఎంగా సాయి ప్రసన్న, విద్యార్థులు టీచర్లుగా పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని రాజ్‌పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. హెచ్‌ఎంగా దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులుగా సాత్విక, అలేఖ్య, శ్రీజ, హర్షిని, శ్రీవాణి, రాజు, భార్గవ, తేజలు వ్యవహరించారు. కార్యక్రమాన్ని ఎంఈవో మధుమోహన్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని రాబోయే రోజులు ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



కౌడిపల్లి: తునికి ప్రాథమిక పాఠశాలలో..



పాపన్నపేట(మెదక్): కొడుపాక పాఠశాలలో..



రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు